

- ప్రజాపాలన గ్రామసభల్లో రెండుసార్లు దరఖాస్తులు
- తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా
- ప్రజాపాలన దరఖాస్తులను వదిలి కులగణన ఆధారంగా సర్వే
- అందులో పేర్లు లేక కంగుతిన్న జనం
- ప్రభుత్వ తీరుపై అసహనం



పెద్దపల్లిలోని మీసేవా కేంద్రంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

రేషన్ కార్డుల జారీలో అయోమయం

పెద్దపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు అందని ద్రాక్షలా మారాయి. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొత్త రేషన్ కార్డులను జారీ చేయడంలో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నది. ఏడాదిలో రెండుసార్లు జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోగా, మళ్ళీ మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొనడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. గత ఏడాది ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కాదని కులగణన సర్వే ద్వారా రేషన్ కార్డులు లేని వారి జాబితా ఆధారంగా అర్హతలపై సర్వే చేయడం ఆందోళనకు గురి చేసింది.

● రేషన్ కార్డుల్లో పేర్లు లేక ప్రజల ఇబ్బందులు

రెండో విడత నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో రేషన్ కార్డుల జాబితాల్లో పేర్లు లేక అనేక మంది ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్డులు ఇవ్వని కారణంగా అర్హులైన వారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను జారీ చేస్తామని, ఆరు గ్యారంటీ పథకాలతోపాటు ఇతర పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో అనేక మంది అర్హులైన వారికి రేషన్ కార్డులు రాక చాలా ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులను జారీ చేయలేదు. ప్రజల నుంచి తీవ్రంగా వచ్చిన ఒత్తిళ్లతో 2021లో ఒకసారి కార్డులను జారీ చేసి ఆ తర్వాత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియను నిలిపివేసింది. రేషన్ కార్డులు లేని కారణంగా అనేక కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు నోచుకోక నష్టపోయారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 26 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన పట్టణ, గ్రామ సభల ద్వారా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహజ్యోతి, మహాలక్ష్మి, సబ్సిడీ గ్యాస్, తదితర ఐదు గ్యారంటీ పథకాలకు ఒకే ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ పథకాలు దక్కాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. రేషన్ కార్డు లేని వాళ్ల తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 15,432 దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ప్రభుత్వం రేషన్ కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా మీ సేవా కేంద్రాల్లో చేసుకున్న దరఖాస్తులను పట్టించుకోలేదు. అలాగే చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించ లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని అర్హత గల వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుండగా, రూ.500కే వంట గ్యాస్ అందజేస్తున్నారు. రేషన్ కార్డులు లేని వాళ్లకు ఇప్పటి వరకు కూడా ఈ పథకాలు వర్తించ లేదు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డు లేదనే కారణంగా వాటిని పరిగణనలోకి తీసుకోలేదు.

ఏడాది తర్వాత ప్రక్రియ ప్రారంభం

ఏడాది తర్వాత జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం ఆరంభించింది. రేషన్ కార్డుల విషయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా కులగణన సర్వేలో రేషన్ కార్డులు లేవని పేర్కొన్న వారి జాబితాలను ప్రభుత్వం తయారు చేసింది. ఆ దరఖాస్తుల ఆధారంగా జనవరి 26కు ముందు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సర్వే చేయించారు. సర్వే సందర్భంగా చాలా మంది పేర్లు రాకపోవ డంతో ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల గురించి ఆందోళన వద్దని, గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 12,572 కుటుంబాలు కొత్త కార్డులకు అర్హులని అధికారులు గ్రామసభల్లో ప్రకటించారు. అందులో అర్హత లేని పేర్లు ఉన్నాయని, అర్హత ఉన్న వారి పేర్లు గల్లంతు కావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మళ్ళీ దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు జిల్లాలో 25,435 దరఖాస్తులు వచ్చాయి. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

గత నెల 26వ తేదీన మండలానికి ఒక గ్రామంలో కార్డులను జారీ చేశారు. గ్రామసభల్లో ప్రకటించిన వారికి ఇంకా జారీ చేయలేదు. మరల మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ప్రజా పాలన గ్రామసభల్లో రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా, అంతకు ముందు మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డు రాలేదని మొత్తుకుంటున్నారు. గ్రామసభల్లో ప్రకటించిన వారికి రేషన్ కార్డులు ఇస్తారా, లేదా అనే విషయమై స్పష్టత లేదు. మండలానికి ఒక్కో గ్రామంలో రేషన్ కార్డులు ఇచ్చిన వారికి ఫిబ్రవరిలో బియ్యం కోటా

మిగతా 8వ పేజీలో...

బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సద్గురు సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఆదివారం గోదావరిఖని గాంధీనగర్‌లో సింగరేణి ఫారెస్ట్ డీజీఎం కరుణ ఆధ్వర్యంలో జరిగాయి. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యాగంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజర్లు ఒకప్పుడు దేశంలో వెనుకబడి పోయారని, కానీ నేడు వారు అత్యున్నత స్థాయిలో ఉన్నారని, చదువులో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారన్నారు. బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, సీఐటీయూ నాయకుడు రాజిరెడ్డి, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హిందు మతం గొప్పతనాన్ని గిరుజనులకు తెలియజేసిన మహానుభావుడు సేవాలాల్ అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం లంబాడితండా (బి)లో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఏఎంసీ నాయకులు కొత్త నర్సింహులు, గిరిజనులు పాల్గొన్నారు.

కుల సర్వే కోసం కౌంటర్ ఏర్పాటు

జూలపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆర్థిక కుల సర్వేలో పాల్గొనని ప్రజలకు మరో అవకాశాన్ని కల్పిస్తూ ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను మండల పంచాయతి అధికారి అనిల్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజలు సర్వేలో భాగస్వాములు కావాలని ఎంపీఓ పేర్కొన్నారు.

● బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు

- చేపలు, మటన్‌కు గిరాకీ
- బెంబేలెత్తుతున్న చికెన్ వ్యాపారులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. బర్డ్ ఫ్లూతో కోళ్ల పరిశ్రమ కుదేలవుతుండగా చికెన్ లేనిదే ముద్దదిగని చికెన్ ప్రియులు అయోమయంలో పడ్డారు. పది రోజులుగా బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి లక్షల కోళ్లు మృత్యువాత పడుతుండడంతో ప్రభుత్వం బాయిలర్ చికెన్ తినవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడడంతో అటు నుంచి కోళ్లు రాకుండా చెక్ పోస్టుల వద్ద ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఆదివారం వచ్చిందంటే కోల్‌బెల్ట్ ప్రాంతంలో చికెన్



గోదావరిఖని మార్కెట్‌లో మూసి ఉన్న చికెన్ షాపులు

సెంటర్ల వద్ద రద్దీగా ఉండేది. కానీ ఇప్పుడు చికెన్ సెంటర్ల వద్ద గిరాకీ అగుపించ లేదు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోజుకు 2వేల నుంచి 3వేల కోళ్ల విక్రయాలు జరుగుతుండగా ఆదివారం 5వేల వరకు కోళ్ల అమ్మకాలు జరుగుతాయి. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో మార్కెట్‌కు కోళ్లు రాకపోగా వచ్చిన కోళ్లు కూడా వినియోగదారులు కొనుగోలు చేయడం లేదు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో



చేపలు విక్రయిస్తున్న వ్యాపారి

సమ్మక్క- సారలమ్మ, పోషమ్మ, ఎల్లమ్మ దేవతలకు మొక్కులు చెల్లించి కోళ్లు, మేకలు కోయడం ఆనవాయితీ. ఇప్పుడు సమ్మక్క సీజన్ కావడంతో భయంతో కోళ్ల మొక్కులు కూడా చెల్లించడం లేదు. ఆదివారం గోదావరిఖని మార్కెట్‌తోపాటు చుట్టు పక్కల ఉండే చికెన్ సెంటర్లు వినియోగదారులు ఖాళీగా అగుపించాయి. మరో పక్క హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూసివేశారు. యువత ఫాస్ట్ ఫుడ్‌కు ఎక్కువగా అలవాటు పడడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సాయంత్రం అయ్యిందంటే ఫాస్ట్‌ఫుడ్ సెంట ర్లు కళకళలాడేవి. వారం రోజులుగా సెంటర్లకు కూడా వెళ్లడం లేదు. రెస్టారెంట్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. బిర్యాణిలు, చికెన్ స్టాటర్స్ కొనుగోలు చేయడం లేదని, రెస్టారెంట్లకు తినడానికి కూడా ముందుకు రావడం లేదని యజమానులు చెబుతున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం వస్తే సుమారుగా పది క్వింటాళ్ల వరకు చికెన్ విక్రయాలు జరిగేవని, కానీ నేడు ఆ పరిస్థితి లేదని రిటైల్ వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో బర్డ్ ఫ్లూ గురించి ఎక్కువగా ప్రచారం చేయడంతో వినియోగదారులు భయపడిపోతున్నారు.

● పెరిగిన చేపలు, మటన్ ధరలు

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో చేపలకు, మటన్‌కు గిరాకీ పెరిగిపోయింది. దీంతో ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారి చేపలకు ధరలను పెంచేశారు. నిన్న మొన్నటి వరకు బొమ్మె చేపలు రూ.400కిలో ఉండగా వాటిని రూ.500 నుంచి రూ.600లకు విక్రయిస్తున్నారు. అదే విధంగా రవులు, బొమ్మెలు, జెల్ల, బొచ్చ చేపలు కూడా రూ.200 నుంచి రూ.300, రొయ్యలు రూ.350 నుంచి రూ.400లకు విక్రయిస్తున్నారు. అదే దారిలో మటన్ ధరలు కూడా పెంచేశారు.

మిగతా 8వ పేజీలో...

ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు

- రూ.12.18 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు
- నిర్మాణ దశలో భక్తుల వసతి భవనాలు

6



ఓదెల మల్లికార్జున స్వామి క్షేత్రం

కొన‘సాగు’తున్న పనులు

- నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ పనులు
- భూ యజమానులకు అందని పరిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

7



నిలిచిపోయిన ఆర్అండ్‌బీ శాఖ పనులు

పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం

మంథని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ వెల్లడించారు. తమ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలల పాటు పొడిగించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, అభివృద్ధి పథకాలను వారికి అందే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. సం ఘం అభివృద్ధికి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రైతులకు మరింత సేవలందించడానికి తమ పదవీ కాలాన్ని పొడిగించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీజీక్యాబ్ చైర్మన్ రవీందర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘ఖని’ కూరగాయల మార్కెట్‌లో..

దళారుల దందా

- రైతుల నుంచి 10శాతం కమీషన్
- కార్పొరేషన్ షెటర్లు అమ్ముకుంటున్న వ్యాపారులు
- ముందు స్థలాన్ని లీజుకు ఇస్తూ వసూళ్లు
- కాసులకు కక్కుర్తి పడుతున్న కార్పొరేషన్ అధికారులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

గోదావరిఖని, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో దళారుల దందా నడుస్తోంది. రైతుల పండించే కూరగాయలకు ఏడాది ముందే అడ్వాన్స్‌లు ఇచ్చి దిగుబడి వారికే విక్రయించేలా మాట్లాడుకుంటున్నారు. దళారులు చెప్పిందే ధర. రైతు పంటపై సరాసరి బహిరంగంగా 10శాతం కమీషన్ తీసుకుంటు న్నారు. వీళ్ల చెప్పినట్టు వినకుంటే రైతులు తమ కూరగాయలను రోడ్డు మీద వదిలి వెళ్లిపోవాల్సిందే. మూడు జిల్లాల కూరగాయల వ్యాపారులను దళారులు శాసిస్తున్నారు. కేవలం ఉదయం 4 నుంచి 7 గంటల వరకు రైతులను దోచుకుంటున్నారు గోదావరిఖని కూరగా యల మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులు.



గోదావరిఖని కూరగాయల హోల్‌సేల్ మార్కెట్

రామగుండం కార్పొరేషన్‌కు చెందిన వెజిటెబుల్ మార్కెట్‌లోని 18 షటర్లను పుష్కరం క్రితం కూరగాయల వ్యాపారులు లీజుకు తీసుకున్నారు. ఒక్కో షటర్‌కు నెలకు కేవలం రూ.800మాత్రమే అద్దె చెల్లిస్తున్నారు. ఈ 12ఏళ్లలో కార్పొరేషన్ అధికారులు అద్దె పెంచకుండా మేనేజ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి అద్దెకు తీసుకున్న షటర్‌ను రూ.48 లక్షలకు ఇటీవల అమ్ముకున్నారు. 14షటర్లలో పది షటర్లు అమ్ముడుపోయాయి. కొందరు కొనుగోలుదారులు కార్పొరేషన్‌లో పేరు మార్పిడి చేసుకోగా మరికొందరు పరస్పర ఒప్పంద పత్రాల మీద దందా నడిపిస్తున్నారు. అంతేకాకుండా షటర్ల ముందు కార్పొరేషన్‌కు సంబంధించి ఖాళీ స్థలంలో రిటేల్‌గా కూరగాయలు అమ్ముకోవడానికి రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు లీజుకు ఇస్తున్నారు. కార్పొరేషన్‌లో అధికారులకు నెలనెల మామూళ్లు ఇచ్చి ఈ దందాను మేనేజ్ చేసుకుం టున్నారు.

రైతుల పంటకు దళారులే యజమానులు

మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించిన రైతులు గోదావరిఖని హోల్‌సేల్ మార్కెట్‌కు కూరగాయలు తరలిస్తారు. రోజూ ఉదయం ట్రాలీ ఆటోలు, వ్యాన్‌లలో ఇక్కడి మార్కెట్‌కు తీసుకువస్తారు. వ్యాన్ల నుంచి కూరగాయలను దించేందుకు హమాలీల ఖర్చు కూడా రైతులే భరించాలి. కూరగాయలకు హోల్‌సేల్ వ్యాపారులే ధర నిర్ణయిస్తారు. వాళ్ల నిర్ణయించిన ధరకు రైతు అమ్మాల్సిందే. తీసుకొచ్చిన కూరగాయలు తీసుకెళ్లలేక దళారులు చెప్పిన ధరకే రైతులు అమ్మేస్తారు. కూరగాయలు తీసుకొని పదిశాతం కమీషన్ కట్ చేసుకుని మిగిలిన డబ్బులు రైతులకు ఇస్తారు. కూరగాయలను రిటేల్ వ్యాపారులకు అప్పుడే అమ్మేస్తారు. కేవలం మధ్యవర్తిత్వం వహించినందుకు 10శాతం హోల్‌సేల్ వ్యాపారులు దండుకుంటారు. కోట్ల రూపాయలు వెచ్చించి వ్యాపారాలు చేస్తున్న వారికే 2 నుంచి 5శాతం లాభాలు రావడం లేదు. పైగా వీళ్లంతా ప్రభుత్వానికి వివిధ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. పెట్టుబడి లేకుండానే 10శాతం మూడు గంటల్లోనే దళారులు సంపాదించుకుంటున్నారు. రోజూ ఈ మార్కెట్‌లో రూ.30 లక్షల కూరగాయలను వ్యాపారులు టర్నోవర్ చేస్తున్నారు. అంటే నెలకు రూ.9కోట్లు, సంవత్సరానికి రూ.120కోట్లు. దీనిపై సరాసరి ప్రయోజనం 10శాతం. రైతుల నుంచి వీళ్ల నిర్ణయించిన రేటుకే కూరగాయలు కొంటున్న హోల్‌సేల్ వ్యాపారులు రిటేల్ వ్యాపారులకు మాత్రం అదనపు ధరకు అమ్ముకుంటారు. ఫంక్షన్లకు బల్క్‌గా ఆర్డర్లపై తీసుకెళ్లే కూరగాయలపై 50శాతం నుంచి 100శాతం ధర పెంచి అమ్ముకుంటారు.

కాసులకు కక్కుర్తిపడుతున్న కార్పొరేషన్ అధికారులు

కార్పొరేషన్ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. పన్నెండు ఏళ్ళుగా షెటర్ల ధరలు పెంచలేదు. కార్పొరేషన్ పరిధిలో వ్యవసాయ ప్రాంతం లేదని రైతు మార్కెట్‌ను తీసేశారు. మూడు జిల్లాల కూరగాయలు పండించే రైతుల పంటలు ఇక్కడికే వస్తాయి. కార్పొరేషన్‌కు కిరాయి వసూలు చేసుకోవడం కంటే ఇక్కడి దందాలపై వస్తున్న చిల్లర కాసులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కైకిలి కూడా ఎల్తలేదు...

మేకల శ్రీనివాస్, రైతు, హన్మంతునిపేట



ఐదెకరాల్లో సాగుచేస్తే చివరకు కూలీల కైకిళ్లు కూడా ఎల్తలేవు. ఇక్కడ సేట్లు 10శాతం కమీషన్ తీసుకుంటున్నారు. హమాలీలకు మాయే పైసలు. తక్కువ ధరకు టమాటా కొంటున్నారు. బయట పారేసే బదులు ఆ రేటుకే అమ్ముతున్నాం. కూరగాయలు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు లేవు.

రైతు బాగుపడ్డది లేదు

కొమురయ్య, రైతు, బ్రాహ్మణపల్లి



పంటకు హోల్‌సేల్ వ్యాపారులే యజమానులు. ఏ ఉత్పత్తికి అయినా ఉత్పత్తిదారుడు ధర నిర్ణయిస్తాడు. కానీ రైతు పంటకు ధర నిర్ణయించుకోలేడు. చౌరస్తాలో కొన్ని రోజులు తామే అమ్ముకున్నాం. వ్యాపారులు అడ్డాలను ఆక్రమించుకున్నారు. వాళ్లకు అవసరం ఉన్నంతనే కొంటారు. మిగిలిన కూరగాయలు పారేసి పోకటే.

మేమెట్ల బతుకుడు...

కరీమ, రిటైల్ వ్యాపారి...



హోల్‌సేల్ వ్యాపారుల మడిగెల పక్కకే రిటేల్ దుకాణాలు ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు, రైతులు రిటేల్‌గా పెట్టి అమ్ముతున్నారు. మేమెట్లా బతుకుడు. రైతుల దగ్గర నుంచి తీసుకున్న కూరగాయలకు ధర పెంచి అమ్ముతరు. మార్కెట్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవు. కూరగాయలు అమ్మేది ఎక్కువ ఆడవాళ్లమే. చానా ఇబ్బంది అవుతుంది.

రైతుకు వెంటనే పైసలిస్తాం...

ప్రవీణ్‌రెడ్డి, హోల్‌సేల్ వ్యాపారి



రైతుకు వెంటనే పైసలిస్తాం. కొందరు రైతులకు అడ్వాన్స్ ఇస్తాం. మున్సిపాలిటీకు అద్దె కడుతున్నాం. పార్ట్‌నర్ షిప్ డీడ్ చేసుకుని ఇతరులను కలుపు కుంటున్నాం. మాకు వెళ్లకనే షటర్లు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. రిటేల్ అమ్మకం వాళ్ల దగ్గర మా డబ్బులు కోట్ల రూపాయలు ఉన్నాయి. మా ఇబ్బందులు మాకు తెలుసు.

ఆన్‌లైన్ గేములకు యువకుడి బలి

● అప్పుల పాలై ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేములకు బానిసైన ఓ వ్యక్తి అప్పులపాలై మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏదిగ మధు(33) ఆన్‌లైన్, బెట్టింగ్ గేమ్స్ ఆడి అప్పులు పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఈనెల 10న తన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుమనించిన కుటుంబ సభ్యులు 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ముప్పిడి రాంరెడ్డి(72) అనే వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి ఈనెల 15న రాత్రి మెట్‌పల్లి గ్రామంలోని తన బామ్మర్ది తుమ్మల పురుషోత్తంరెడ్డి ఇంటికి వచ్చాడు. రాంరెడ్డి కుటుంబ సభ్యులు దూర మవడం వలన తాగుడుకు బానిసయ్యాడు. బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగి మృతిచెందాడు. మృతుడి బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


మహిపాల్ (ఫైల్)

దర్మారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన ధర్మారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. శనివారం మండల కేంద్రానికి చెందిన నార మహిపాల్ (32)అనే యువకుడు బైక్‌పై ఎంపల్లి నుంచి ధర్మారం లోని ఓ వంక్షన్‌హాల్‌లో జరిగే వేడుకకు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో మహిపాల్ తలవెనుక భాగంలో తీవ్రగాయాలు కాగా పక్క చెవులకు విరిగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటా హుటిన హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శని వారం రాత్రి చికిత్స పొందుతూ మహిపాల్ మరణించాడు. యువ కుడి తమ్ముడు జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం లక్ష్మన్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరు..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో చెన్నైకి చెందిన జీవా(55) అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆరునెలల క్రితం జీవా సుల్తానాబాద్ వచ్చాడని, ఇతను సమీప ప్రాంతాలలో కూలీ చేస్తూ మద్యం తాగుతూ బస్టాండ్‌లోనే పడుకుంటున్నాడని వివరించారు. శనివారం జీవా అధికంగా మద్యం సేవించి బస్టాండ్ ఆవరణలో నిద్రించగా అలాగే మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం కొందరు గుర్తించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని, సహచర కూలి హరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు..

కథలాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గడ్డమీద గంగు(72) అనేవృద్ధురాలి చీరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మృతి చెందింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. శనివారం రాత్రి సిలిండర్‌పై టీ తయారు చేసుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. దీంతో తీవ్రగాయాలైన గంగును జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలు గంగు కొడుకు గంగనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కుంభమేళాకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● చికిత్స పొందుతూ మహిళ మృతి


ప్రమీల (ఫైల్)

దర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. జగిత్యాలజిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన వెంగళ ప్రమీల(52) అనే మహిళ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లు మనుమ రాళ్లతో కలిసి ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)కు మూడు వాహనాల్లో వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో గురువారం ప్రమీల ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రమీల తీవ్రంగా గాయపడడంతో సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. ప్రమీల మృతదేహాన్ని అమెస్వగ్రామమైన జాలపల్లికి తరలిస్తున్నట్లు సమాచారం.

మంగళపల్లెలో ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్

కొనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఓరైతుకు చెందిన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామానికి చెందిన ఉప్పుల జీవన్ అనే రైతు తన ట్రాక్టర్‌ద్వారా చేనులో పత్తికట్టె చదునుచేస్తున్నాడు. పక్కనున్న చేనులో పత్తి కట్టకు అప్పటికే నిప్పు అంటించారు. పత్తి కట్టె వైపు మిగతా చేనులోని పత్తి కట్టను సెట్టె ప్రయత్నంలో కందకంలో ట్రాక్టర్ దిగబడింది. ఆభాగంలోని మండుతున్న పత్తికట్టె ట్రాక్టర్‌ డీజిల్ ట్యాంకుకు అంటుకోని మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధిత రైతుకు మూడులక్షల వరకు నష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అటవీ ప్లాంటేషన్‌లో మంటలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా గ్రామశివారులోని అటవీప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పది హెక్టార్ల ప్లాంటేషన్ మొక్కలు ఆదివారం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్, ఫైర్ బ్లోయర్‌తో మంటలను చల్లార్చారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ సెక్షన్ అధికారి భూలక్ష్మీ పేర్కొన్నారు.

ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని వ్యవసాయమార్కెట్ ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కిష్టయ్య ఫ్యూక్టరులకు చెందిన భూమికి నకిలీ పట్టాదారుపాసు తయారు చేసి మోసపూరితంగా మ్యూటేషన్ చేసిన కేసులో వినయ్‌రావు, వీరయ్య, దివ్య, వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అందరి చూపు.. ఉమ్మడి జిల్లా వైపు..

● పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడే
● ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు
● ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కీలకంగా మారింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధికి సంబంధించిన ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న ఓటర్లలో 45.12శాతం ఓట్లు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. దీంతో అన్ని రాజకీయ చాటుకోవడానికి ఈ ఫలితం ఊతంగా నిలుస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన వారు 23 మంది, బీజేపీకి చెందిన వారు ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన12 మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పరిధిలో ఆరుగురు ఎంపీలు ఉండగా నలుగురు బీజేపీకి చెందిన వారు, ఇద్దరు కాంగ్రెస్ వారున్నారు. బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోవడంతో కాంగ్రెస్, బీజేపీ ఈ పట్టభద్రుల స్థానాన్ని గెలుచుకోవడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. అందుకే ఆ రాజకీయ పక్షాలు పట్టభద్రుల



పార్టీలు, అభ్యర్థులు దృష్టి ఈ జిల్లాపైనే కేంద్రీకృతమవుతున్నది. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో మకాం వేసి తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

● **పట్టు సాధించేందుకు..**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనుండడంతో ఇక్కడి ఫలితాలు ఆ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల నుంచి బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోగా, కాంగ్రెస్, బీజేపీ బరిలో ఉన్నాయి. ఇక్కడ గెలుపు సాధించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు ఏ ఎన్నికలు వచ్చినా ప్రజల్లో తమకు ఉన్న పట్టేమిటో ఎన్నికల ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ప్రత్యేక దృష్టిసారించాయి.

● **పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు**

రెండు రాజకీయ పక్షాలు నియోజకవర్గ స్థాయిలో పార్టీశ్రేణులు, నాయకులు, పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో 25, 50 ఓట్లకు ఒక్కరిని ఇన్‌చార్జిగా నియమించి ఆ ఓటరుతో సత్సంబంధాలు పెట్టుకొని రోజూ మాట్లాడుతూ పోలింగ్ రోజు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొని వచ్చి ఓటు వేసేలా చూడాలని బాధ్యతలు అప్పగిస్తున్నాయి. ఓటర్లను నేరుగా కలిసేందుకు వీలులేని పరిస్థితి ఉండ డంతో పార్టీ కేడర్‌పైనే ప్రధాన బాధ్యతను ఉంచుతు న్నారని చెబుతున్నారు. ఇరు

● **నియోజకవర్గ స్వరూపం**

నియోజకవర్గ పరిధిలోకి 13 జిల్లాలు పూర్తిగా, 2 జిల్లాలు పాక్షికంగా వస్తాయి. ఆరు పార్లమెంట్ స్థానాలు, 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉన్నది. నియోజకవర్గ పరిధిలో 2,26,765 మంది పురుషులు, 1,28,392 మహిళలు, ఇద్దరు థర్డ్‌జెండర్లు ఓటర్లుగా ఉన్నారు. మొత్తం నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు ఉన్నాయి. వీటిలో 1,60,260 ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ ఓట్లు నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓట్లలో 45.12శాతం కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలో 71,545 ఓట్లు, పెద్దపల్లి జిల్లాలో 31,037 ఓట్లు, జగిత్యాల జిల్లాలో 35,281 ఓట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22,397 ఓట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ఓట్లనే పరిగణలోకి తీసుకున్నా 20 శాతం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రం లోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలు సంబంధించిన పట్టభద్రులు ఓట రుగా ఉన్న ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగు తుండడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

పార్టీలకు చెందిన నాయకులు, ప్రత్యర్థి పార్టీవారు తమ తమ సమావేశాల్లో మాట్లాడుతున్న అంశాలు ఏమిటి, వారు వస్తు తున్న వ్యూహాలు ఏమిటి అనే విషయాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

● **ప్రచారంలో కీలకమవుతున్న బీసీ, స్థానిక నినాదాలు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్థానిక, బీసీ నినాదాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓట్లే 45శాతం కావడంతో స్థానిక నినాదం బలంగా వస్తున్నది. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కరీంనగర్ జిల్లాకు చెందిన వారనే కారణంతోనే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాంతాల నుంచి నామినేషన్ వేసిన అభ్యర్థులందరూ తాము స్థానికులమని, తమకు అవకాశం కల్పించాలని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీ నినాదం బలంగానే వినవస్తున్నది. ఒకవైపు బీసీ కుల గణన జరుగుతుండడం, మరోవైపు రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే తమ రాజకీయ అవకాశాలను కాలరాస్తున్నారని బీసీ వర్గాలు పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నాయి. బీసీ వాదం బలంగా ఉండటంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందినవారని, బీసీ కులానికి చెందిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక, బీసీ నినాదాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పోలీసులు పట్టించుకోవడం లేదు..

● న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపిన బాధితుడు


కేశవపట్నంలో పురుగుల మందు డబ్బాతో సెల్ టవర్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు కొంరయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని శంకరపట్నం మండలం కేశవపట్నంలో సెల్‌టవర్ ఎక్కి ఓవ్యక్తి నిరసన తెలిపిన సంఘటన చోటు చేసుకుంది. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం కొంరయ్య ఆదివారం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడు కొంరయ్య మాట్లాడుతూ తన తమ్ముడు తిరుపతి రేకులు కూల్చి తనభార్యను కొట్టడంతో మనస్తాపం చెంది 15రోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. చికిత్స పొందుతూ శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అయితే తన భార్యను కొట్టిన తమ్ముడిపై సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎస్ఐ పట్టించుకోవడం లేదన్నారు. తనకు న్యాయం జరగలేదంటూ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని సెల్‌టవర్ దించేందుకు ప్రయత్నాలు చేశారు. తనకు న్యాయం జరిగేలా చూస్తానంటేనే దిగుతానని, లేదంటే ఇక్కడే ఉంటానని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు అతనికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పి కిందకి దింపి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● కాలి బూడిదైన నగదు, నిత్యావసర సరుకులు


చింతకుంటలో కాలిపోయిన గుడిసె

కథలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అలకుంట చిలుకవ్వ అనే మహిళ గుడిసె దగ్ధమైంది. విద్యుత్‌వైర్లు అంటుకోవడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు వచ్చి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబసభ్యులకు మెలకువ రావడంతో బయటకు పరుగులు పెట్టారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న 22 వేల రూపాయలు, నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. కాగా కూలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న చిలుకవ్వ కుటుంబం ఈ ఘటనతో బజారున పడింది.

● రూ.12.18 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు
● నిర్మాణ దశలో భక్తుల వసతి భవనాలు

ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు

ఓదెల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రముఖ ఆలయమైన ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12.18కోట్లతో ప్రణాళికలను దేవాదాయ, ధర్మదాయ శాఖకు ప్రతిపాదించారు. అలాగే ఇందులో కొన్ని అభివృద్ధి పనులను చేపట్టారు. రూ.50 లక్షలతో

● **దాతల సహకారంతో అభివృద్ధి పనులు**

ప్రస్తుతం ఆలయంలో బంగారు పోచమ్మ, మదన పోచమ్మ, గుడిలో భక్తులకు కోనేరు పనులు పూర్తయ్యాయి. దాతల సహకారంతో వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయి ప్రారంభమైంది. హైమాస్ విద్యుత్ దీపాల ఏర్పాటు, మదన పోచమ్మ, బంగారు పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ సొంతంగా రూ.60 లక్షలతో గెస్ట్ హౌస్ నిర్మిస్తున్నారు. అలాగే కాలభైరవ విగ్రహానికి తొడుగులు ఏర్పాటు చేశారు. ఆలయ సందర్శనకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్, రెండు కూలర్లు ఏర్పాటు చేశారు.

భక్తులకు వసతి భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆలయానికి రూ.47 లక్షల వ్యయంతో రథం, రూ. 50 లక్షలతో షెడ్ల నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం అనుమతులు పొందారు. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో మదన పోచమ్మ, బంగారు పోచమ్మ, కోనేరు నిర్మాణం కాగా, రూ.10 కోట్ల నిధుల వ్యయంతో ఆలయ ప్రాకారానికి, రాజగోపురానికి డీపీఆర్ తయారుచేసి


నిర్మాణ దశలో భక్తుల వసతి గృహం



ప్రభుత్వానికి పంపించారు.

● **మిగిలిన అభివృద్ధి పనులు**

ఆలయ పరిసరాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం సామూహిక మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మాణం చేయాల్సి ఉంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల పట్టణంలో ఆలయ కమాన్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కమిటీల తీర్మానాలు అధికారులకు పంపించారు. దుస్తులు మార్చుకు నేందుకు షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. అలాగే భక్తుల భోజనాలు తయారీకి షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. భక్తులకు సరిపడు స్థలం కోసం భూసేకరణ చేపట్టి, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి
– సదయ్య ఈవో ఓదెల



ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధుల కేటాయింపు కొంత పరిమితంగా ఉంటుంది. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

చివరి మజిలీకి కష్టాలు

● అధ్వానంగా వైకుంఠధామాలు ● కనీస వసతులు లేక ఇబ్బందులు


మానకొండూర్: శ్రీనివాస్‌నగర్‌లో వైకుంఠధామంలో ధ్వంసమైన దింపుడు కల్లం గద్దె


గంగాధర: నిరుపయోగంగా లక్ష్మీదేవిపల్లి వైకుంఠధామం

గంగాధర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిల్లో అంత్యక్రియలు చేయడానికి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠ ధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గంగాధర మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రజలందరికి చివరి మజిలీ సాఫీగా సాగాలని ఆధునిక వైకుంఠధామాలు నిర్మించారు. పలు గ్రామాల్లో మునుపటి లాగా చెరువు గట్టుకో, వాగు ఒడ్డునో, సొంత స్థలాలు ఉన్న వారు వారి భూముల్లో అంత్యక్రియలు చేస్తుంటే భూములేని పేదలు అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతుండేవారు. శ్మశాన వాటికలు నిర్మించడంతో ఈ సమస్యలు చాలావరకు తగ్గాయి. మండలంలోని రెండు గ్రామాల్లో మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హిమ్మత్‌నగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. శ్మశాన వాటికలకు దారుల లేక ఇప్పటికీ సొంత స్థలాల్లో, పేదలు వాగు ఒడ్డున అంత్యక్రియలు జరుపుతున్నారు. మూడేళ్లుగా ఈ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. పలుమార్లు ఆగ్రామాల్లోని వైకుంఠధామాలు దారి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందించడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **మరమ్మతులు కరువు**

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పైకప్పు ఈదురుగాలులకు లేచిపోయింది. రెండేళ్లుగడిచినా మరమ్మతులు చేయడం లేదు. దింపుడు కల్లం గద్దె, మృతదేహాలను కాల్చే ప్రదేశం, ప్రవేశద్వారం దెబ్బతిన్నాయి. వైకుంఠధామంలో పిచ్చి చెట్లు మొలిచి అందులోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎవరు మృతి చెందిన వారి పొలాల్లో దహన సంస్కారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామంలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చిన ఆర్టీసీ బస్సు

● మహిళకు స్వల్పగాయాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ప్లాట్‌ఫాం పైకి బస్సు దూసుకురావడంతో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగి త్యాల వెళ్లేందుకు ప్లాట్‌ఫాం వద్దకు వచ్చే క్రమంలో నిర్దేశిత స్థానాన్ని దాటుకుని ముందుకు వేగంగా దూసుకువచ్చింది. అప్రమత్తమైన ప్రయాణికులు అక్కడినుంచి తప్పించుకున్నారు. అక్కడేఉన్న ఓ మహిళకేతికి స్వల్పగాయమైంది. వెంటనే ఆర్టీసీ అధికారులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్దప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తికి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం శివారులోని నేహాలపల్లి బస్టాండ్ వద్ద గంగాధర గ్రామానికి చెందిన పోత్తూరి రాకేష్ అనే వ్యక్తి వద్ద గంజాయి పట్టుకున్నామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుని అరెస్ట్ చేసి జుడిషియల్ రిమాండ్‌ తరలించామని తెలిపారు.

అడవుల సంరక్షణకు

'ఫైర్‌లైన్స్'

- అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నిరంతరం అటవీ శాఖ అధికారుల నిఘా
- పెరుగుతున్న అటవీ సంపద

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులకు నిప్పంటుకోవడం సర్వ సాధారణంగా మారింది. అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల వృక్ష సంపద, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే వీర్నపల్లి మండలం ఎక్కువ శాతం అటవీ విస్తీర్ణం కలిగి ఉంది. అధికారులు అటవీ సంరక్షణలో భాగంగా కిలోమీటర్ల మేర 'ఫైర్‌లైన్స్' ఏర్పాటు చేస్తున్నారు.

● అగ్ని ప్రమాదాలు జరిగే తీరు..

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకవెళ్లిన కాపరులు తునికాకు, ఇప్పపూలు, అడ్డపిక్కలు తదితర వాటి సేకరణ



ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

కోసం వెళ్లి ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేయడంతో ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెందుతాయి. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● 'ఫైర్ లైన్స్' ఏర్పాటు..

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు 'ఫైర్ లైన్స్' ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేస్తారు. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ప్రతిఏటా అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడుతారు. ఫైర్‌లైన్స్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది తీసుకున్న చర్యల వల్ల అడవులు ఎక్కువ శాతం కాలిపోకుండా చూశామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

● రాత్రింబవళ్లు ప్రత్యేక నిఘా..

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు రాత్రిపగలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న



వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్

సిబ్బంది మంటలను అదుపుచేస్తారు. వీటివల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

● శాటిలైట్ ద్వారా ముందస్తు సమాచారం..

అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

అన్ని ప్రాంతాల్లో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలి..



- బండారి మహేష్, గొర్ల కాపరి, మద్దిమల్ల

మండలంలోని అన్నిప్రాంతాల్లో ముందస్తుగా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలి. ఫైర్‌లెన్స్ నామమాత్రంగా కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయాలి. జంతువులు, అడవులకు నష్టం కలిగించొద్దు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

- పద్మలత, ఎఫ్ఎస్‌వో, అల్మాస్‌పూర్

అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలను ఫైర్ వాచర్స్ ద్వారా నివారిస్తున్నాం. అటవీ ప్రాంతంలో కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం.



నిరుద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షానపోరాటం చేసింది ఒక్క బీజేపీ మాత్రమే అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్‌మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధి కారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేసే కార్యకర్తలు బీజేపీకి సొంత మన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే లాఠీ దెబ్బలు తిన్నామన్నారు. గ్రూప్‌వన్ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే నిరుద్యోగుల మధ్యకు చేరి బీఆర్ఎస్‌నాయకులు విధ్వంసం సృష్టించాలని చూశారన్నారు. కాంగ్రెస్‌నేతలు ప్రతి పనికి 14నుంచి 18శాతం కమిషన్ అడుగుతున్నారన్నారు. 317జీవోకోసం ఎంపీ కార్యాలయంలో దీక్షచేస్తే కార్యాలయగేట్లను గ్యాస్ కట్టర్లతో పోలీసులు కోశారన్నారు. నా ఆఫీసును ఎక్స్‌కావేటర్‌తో కూల్చాలని కేసీఆర్ సీపీకి వార్నింగ్ ఇచ్చారన్నారు. అయినా ఏనాడు భయపడలేదన్నారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీఎమ్మెల్సీ ఎన్వీఎస్ ప్రసాద్, మాజీమేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతరప్రాంతాల నుంచివచ్చిన భక్తులు ముందుగా రాజన్న కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

నరసింహుడి ఆలయంలో భక్తుల పూజలు



ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. మాఘమాసం బహుళ చవితి సందర్భంగా. సుదూరప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. అందంగా పూలతో అలంకరించినస్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సెక్రెటరీ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాల యాన్ని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సెక్రెటరీ గుగులోతురవి దంపతులు ఆది వారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట అర్చకులు నేరెళ్ల విజయ్, సుముద్రాల వంశీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రెటరీ గుగులోతు రవి దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయంకు వచ్చిన ఆయన స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ప్రధానర్చకులు రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవి తదితరులు ఉన్నారు.



కొండగట్టు అంజన్న సన్నిధిలో రవి దంపతులు

వైభవంగా మల్లన్న బోనాలు



ఆత్మకూర్‌లో బోనాలతో బయలుదేరిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మల్లన్న జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్నస్వామి ఆలయాన్ని పచ్చటితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయంనుంచి మండలంలోని ఆయాగ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఒడిబియ్యం పోసి కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. భక్తులు బోనమును నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి బయలుదేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ చౌట్‌పల్లి లావణ్య-అంజయ్యతోపాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం, ఆలయాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాలతో పాటు వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాలకు మంత్రి పొన్నంప్రభాకర్ ఇంచార్జి మంత్రిగా వ్యవహరిం చనున్నారు. అలాగే కరీంనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ భానుప్రసాద్, పురుమల్ల శ్రీనివాస్ ఇంచార్జిలుగా, కోఆర్డినేటర్‌గా ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి నియామకమయ్యారు. చొప్పదండి కోఆర్డినేటర్‌గా ఎనగల వెంకట్రాంరెడ్డి, మానకొండూర్‌కు గంప వేణుగోపాల్. హుజురాబాద్‌కు ఎండీ రియాజ్‌ను కోఆర్డినేటర్‌లుగా నియమించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జిగా ఒడితెల ప్రణవ్‌బాబును నియమించారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గ ఇంచార్జిలుగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే లేనిచోట డిఫీటెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఇంచార్జిగా నియమించారు. కరీంనగర్ సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి నిజామాబాద్ అర్బన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలోగల గణపతి ఆలయంలో ఆదివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో అభిషేకాది పూజలు

కొన'సాగు'తున్న పనులు

- నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ పనులు
- భూ యజమానులకు అందని పరిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూనారం ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే చేపట్టే పనులు కొనసాగుతుండగా రోడ్డు భవనాల శాఖ పనులు నిలిచిపోయాయి. టెండర్ కాలం ముగిసిన పనులు 60 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.119 కోట్లు కేటాయించింది. రోడ్లు భవనాల శాఖ రూ.34 కోట్లతో ట్రాక్‌కు ఇరువైపుల వంతెన నిర్మించాల్సి ఉంది. మిగితా రూ.85 కోట్లతో ట్రాక్ లైన్ పై సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ స్టీల్ వంతెన నిర్మించాల్సి ఉంది. పట్టాలకు ఇరువైపుల 550 మీటర్ల వంతెన 46 పిల్లర్లతో ఆర్‌అండ్‌బీ శాఖ పనులు చేయాల్సి ఉంది. సర్వీస్ రోడ్డు అప్రోజ్ రోడ్డు, బ్రిడ్జీ పనులు నిలిచిపోయాయి. ఈ పనులకు రెండు సార్లు భూమి పూజ చేసినప్పటికి ప్రారంభం కాలేదు. ముచ్చటగా మూడో సారి 2022లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సెప్టెంబరు 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా పనులు కొనసాగుతున్నాయి. రైల్వే శాఖ పనులు జరుగుతుండగా ఆర్‌అండ్‌బీ శాఖ పనులు ముందుకు సాగడం లేదు. డ్రాయింగ్ అప్రూవల్, ల్యాండ్ అక్విషన్‌లో సమస్యలు, విద్యుత్ లైన్లు తొలగింపు తదితర అంశాలు నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. ఈ సమస్యలను పరిష్కరించి భూసేకరణ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అయితే భూ యజమానులకు డబ్బులు చెల్లించకపోవడంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు పనులు నిలిపివేశారు. పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గతేడాది మార్చిలో రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో బ్రిడ్జి వద్ద సమావేశం నిర్వహించారు. అక్టోబర్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు. ఇది జరిగి సుమారు ఏడాది కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.



కొసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులు

భూ సేకరణ డబ్బులు చెల్లించలేదు

- ఆర్‌అండ్‌బీ ఈఈ డీ బావు సింగ్

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం వాస్తవమే. అయితే భూ సేకరణ చేసి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. డబ్బులు వచ్చాక రెవెన్యూ శాఖ అధికారులు భూమి యజమానులకు అందజేస్తారు. అప్పటి వరకు పనులు జరగవు.

● వాహనదారుల ఇక్కట్లు

కూనారం రూట్‌లో రైల్వే గేటు పడిందంటే గంటకు పైమాటే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గాని గేటు తెరవకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. 2022లో ఫ్లైవోర్ బ్రిడ్జి పనులు మొదలయినప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఏళ్ళ తరబడి సమస్య అలాగే వెంటాడుతోంది. గుంపుల తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగు పై చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కునారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారి గుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వ శ్రీరాంపూర్‌లకు వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్నాయి. గేటు సమస్యతో ఈ దారి గుండా వెళ్ళే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు సమయానికి చేరుకోక చివాట్లు పడుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోకపోవడంతో గైర్హాజరు కావాల్సి వస్తోంది. ఆటోలు, టాటా ఏసీలు గంటల తరబడి గేటు వద్దే ఉండడం వల్ల ట్రిప్పులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే చోట తాత్కాలిక రోడ్డు వేయకపోవడంతో దుమ్ముధూళితోనే గంటల తరబడి గడుపుతున్నారు. బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



గేటు వద్ద వాహనదారుల నిరీక్షణ

రేషన్‌కార్డుల జారీలో అయోమయం

(5వ పేజీ తరువాయి)

విడుదల చేయలేదు. ఇప్పుడు మీ సేవా కేంద్రాల ద్వారా కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చని, చేర్పులు, మార్పులకు అవకాశం ఇచ్చామని ప్రభుత్వం పేర్కొంది. దీంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వాళ్లు, గ్రామసభల్లో పేర్లు వచ్చిన వాళ్లు కూడా మీ సేవా కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డుల విషయమై పూటకో తీరుగా వ్యవహరిస్తుండడంతో అర్హులైన వాళ్లు ఆందోళన చెందుతున్నారు. ఈ గందరగోళ పరిస్థితి ఎందుకని, మీ సేవా కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని ఏడాది కిందటే చెబితే తద్వారానే దరఖాస్తు చేసుకునే వారిమని, వాటిని పరిశీలించి అర్హులకు కార్డులను మంజూరు చేయడంలో ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన వారం దరికీ రేషన్ కార్డులను జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు

(5వ పేజీ తరువాయి)

మేక మాంసం రూ.700 ఉండగా రూ.800, మేక పోతు మాంసాన్ని రూ.800 ఉండగా రూ.900లకు పెంచి విక్రయిస్తున్నారు. నాన్‌వెజ్ ప్రియులు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

● ఎగబాకిన నాటుకోడి ధర

బాయిలర్ కోళ్లు బర్డ్ ఫ్లూ వ్యాధితో మృతి చెందుతుండగా నాటుకోడి, పెరటి కోళ్ల రేట్లు కూడా పెరిగిపోయాయి. గతంలో రూ.500కిలో ఉన్న నాటు కోడి ఇప్పుడు రూ.600 నుంచి 700వరకు విక్రయిస్తున్నారు. జుట్టు కోడి రూ.120 ఉంటే నేడు రూ.220లకు పెరిగిపోయాయి. పెరటి కోళ్ల కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

● పెళ్లిళ్లలో చికెన్ వంటలు బంద్

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎవరైనా నాన్‌వెజ్ వంటకాల్లో మటన్, చికెన్, చేపలను పెట్టే వారు. పెళ్లిళ్లలో చికెన్ వంటకాలను చేయడం లేదు. మటన్, చేపలు, గుడ్లను భోజనాల్లో వడ్డిస్తున్నారు.

చికెన్ కొనుగోలు చేయడం లేదు...
శంకర్, చికెన్ వ్యాపారి



బర్డ్ ఫ్లూతో రోగాలు వస్తున్నాయని ప్రచారంతో మార్కెట్‌కు వినియోగదారులు రావడం లేదు. రెండు కోళ్లు కోసినా అమ్మడుపోని పరిస్థితి. ఆదివారం వస్తే సాయంత్రం వరకు చికెన్ అమ్మకాలు జరిగేవి. సామాజిక మాద్యమాల్లో ప్రచారం ఎక్కువ కావడంతో బాయి లర్ కోళ్లను కొనుగోలు చేయడం లేదు. పది రోజుల నుంచి మార్కెట్ వెలవెలబోతుంది. కోళ్ల విక్రయాలు కూడా జరుగడం లేదు. గతంలో జాతరలు, పండుగలు వస్తే అమ్మకాలు ఎక్కువగా ఉండేవి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1998-1999లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి మెమొంటోను అందజేశారు. సుమారు 50వేల రూపాయల విలువగల మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలలో స్వీపర్‌గా పనిచేసి రిటైర్ అయిన కళావతికి రూ.3వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మరణించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల మృతికి సంతాపంగా మౌనం పాటించారు. పలు చోట్ల ఉంటున్న వారు ఒక చోట కలిసి యోగక్షేమాలు తెలుసుకుని ఆనందంగా గడిపారు.

ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి అంజయ్య ఆదివారం ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉచితంగా ఈసీజీ, బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 150 మంది పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందలు పంపిణీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందజేయడం కోసం శిబిరాన్ని నిర్వహించామని నిర్వాహకులు గుర్రం కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షిత్, కోట కర్ణాకర్, మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఎస్పీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ అన్నారు. సుల్తానాబాద్ లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తి, పేద వర్గాల నుంచి ఎదిగిన విద్యావంతుడు ప్రసన్న హరిక్రిష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. అలాగే టీచర్స్ అభ్యర్థి సాయన్న ముదిరాజ్‌ను గెలిపించాలని టీచర్లను అభ్యర్థించారు. బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్, మండల అధ్యక్షుడు బోయిని రంజిత్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా బీసీ అభ్యర్థిని గెలిపించండి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థిని గెలిపించాలంటూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలో రవిందర్ తదితర బీసీ నాయకులు డోర్ టు డోర్ ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రసన్న హరిక్రిష్ణకు మొదటి ప్రాదాన్యం ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు.

మాజీ సీఎం జన్మదిన వేడుకలు



ఓదెలలో మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఓదెల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఓదెల మండల కేంద్రంలోని పలు చోట్ల మొక్కలు నాటుతూ చెట్ల ప్రాధాన్యతను పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట రాములు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ డైరక్టర్లు బోడకుంట నరేష్, బుద్దె కుమారస్వామి, చింతం వెంకటస్వామి, బోగె సదానందం, తీర్థాల కుమార్, చింత మొగిలి, రాచర్ల కుమార్, బియ్యాల ఐలయ్య, గడ్డం శ్యామ్, మహేందర్ పాల్గొన్నారు.

ఇంటింటికి పూలే, అంబేద్కర్ జ్ఞానమాల



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సంపత్, కార్మిక సంఘం నాయకులు తోట వేణు అన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. మనువాద శక్తులు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నాయని దానిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగమే దేశ ప్రజలకు రక్షణ కవచంగా ఉందని పేర్కొన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొంకూరి మధు, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్‌బాబు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, బూడిద మహేందర్, మిట్టపల్లి రాజేంద్రకుమార్, ఆర్నకొండ వెంకటేశ్వర్లు, బోట్ల స్వామి, పోగుల రంగయ్య, సాగర్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా అంబేద్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో పూలె, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సంఘం నాయకులు నివాళులర్పించారు. పూలె, అంబేద్కర్ ఆలోచనా విధానాలను విస్తృత ప్రచారం చేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాలంకుస్ పేర్కొన్నారు. బొచ్చు శంకర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బూడిద సమ్మయ్య, సురేష్, రొంటాల ఐలయ్య, ఆదినారాయణ, పాల్గొన్నారు.

ఉపాధిహామీ ద్వారా పనులు కల్పిస్తున్నాం

ఈజీఎస్ ఏపీవో మంజుల



ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మందికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నారు.

ఏపీవో : మండలంలోని ఆయా గ్రామాల్లో 8537 జాబ్ కార్డులు ఉన్నాయి. 16352 మంది కూలీలకుగాను 9198మంది ఈజీఎస్ ద్వారా పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కూలీలకు ఏఏ పనులు కల్పిస్తున్నారు

ఏపీవో : జాబుకార్డులు ఉన్న కూలీలకు రోజు రూ.300తో చెరువుల పూడిక తీత, కందకాలు, ఫార్మేషన్, ఎస్సారెస్పీ కాలువ పనులు, సానిటేషన్ తదితర పనులు కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని నర్సరీలు ఉన్నాయి.

ఏపీవో : మండలంలో 24గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. వీటిలో రెండు లక్షల 40వేల మొక్కలు పెంచుతున్నాం. మొక్కలను జూన్‌లో రైతులకు ఇవ్వడం జరుగుతుంది.

- కాల్వశ్రీరాంపూర్

ఎన్టీపీసీలో మొబైల్ హిందీ లైబ్రెరీ ప్రారంభం

జ్యోతినగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ పీటీఎస్‌లో ఆదివారం మొబైల్ హిందీ లైబ్రరీని ప్రారంభించారు. రాజ్ భాష హిందీని విస్తృతం చేయడంలో భాగంగా టౌన్‌షిప్‌లో లైబ్రరీని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం(హెచ్‌వోడీ) విజయ్ కుమార్ సిక్దర్ లైబ్రరీని ప్రారంభించారు. నేషనల్ బుక్ ట్రస్ట్(ఎన్‌బిటి) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీలో హిందీతోపాటు తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలను అందుబాటు ఉంచారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థులకు అందుబాటులో ఉండేలా మొబైల్ లైబ్రరీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శన, సభకు ప్రజలు భారీ ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బీ అశోక్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలందరికీ పక్కా గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, వెంకన్న, రాధమ్మ, లక్ష్మి, పద్మ, గుర్లమ్మ, కృష్ణవేణి, పాల్గొన్నారు.

వైభవంగా సంకష్ట హర చతుర్థి వేడుకలు

మంథని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహా గణపతి ఆలయంలో సంకష్ట హర చతుర్థి వేడుకలను భక్తులు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. స్వామి వారికి వేద పండితులు పల్లి రాము శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయడంతో పాటు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ అవరణ సందడిగా మారింది.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఎలిగేడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కం డువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. ఆదివారం శివపల్లి గ్రామంలో జూలపల్లి మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రచారంలో భాగంగా సోమవారం బందంపల్లి స్వరూప గార్డెన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి నియోజకవర్గంలోని పట్టభద్రులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ధూళికట్ట పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, సంగసాని రాజారాంరెడ్డి, గంగిపెల్లి చొక్కయ్య, అలకొండ అనంతరెడ్డి, దాడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్, పూసాల, శాస్త్రినగర్, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఈ నెల 17న సోమవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసినట్టు సుల్తానాబాద్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి బందంపల్లి లోని స్వరూప గార్డెన్‌లో సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావల్సిందిగా అబ్బయ్యగౌడ్ పిలుపునిచ్చారు.

న్యాయవాద దంపతుల హత్యకు నాలుగేళ్ళు

మంథని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన గట్టు వామన్‌రావు, నాగమణి దంపతుల దారుణ హత్య సంఘటన జరిగి నేటి 4ఏళ్ళు గడిచాయి. రామగిరి మండలంలోని మారుతినగర్ సమీపంలో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పై కారులో వెళ్తున్న హైకోర్టు న్యాయవాది నాగమణి, గట్టు వామన్‌రావు దంపతుల పై పలువురు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈఘటన పై మంథని తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. హత్యలో ప్రమేయం ఉన్న నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఈహత్యల వెనుక మరి కొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తూ వామన్‌రావు తండ్రి కిషన్‌రావు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీని పై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతుంది.

నిత్యావసర వస్తువులు అందజేత

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జనరల్ మేనేజర్ కె.గోపాల్‌రెడ్డి జన్మదినంగా సందర్భంగా గోదావరిఖని నారాయణ పాఠశాల ఏజీఎం చైతన్యరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ ఆశ్రమంలోని పిల్లలకు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. జ్యోతిగాంధీ ఫౌండేషన్ బాధ్యులు దయానంద్‌గాంధీ, నారాయణ స్కూల్ అకాడమిక్ డీన్ అంజనేయులు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రతతో కూడిన లక్ష్యాలను సాధించాలి

డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్‌వి సూర్యనారాయణ



డైరెక్టర్(ఆపరేషన్)కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

రామగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భద్రతతో కూడిన లక్ష్యాలను సాధించాలని సింగరేణిడైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ అన్నారు. సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డైరెక్టర్ ఆపరేషన్స్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బోల్టర్ మైనింగ్, లాంగ్‌వాల్ పనులపై చర్చించారు. లాంగ్‌వాల్ సాల్వేజింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులో చేపట్టాల్సిన పలు విషయాలపై సూచనలు చేశారు. అధికారులు బండి సత్యనారాయణ, యాదయ్య, రఘురాం, జనార్దన్ పాల్గొన్నారు.

రామగుండం ఓసీల్లో ఓబీ కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్‌లోని ఓసీపీ-5, ఓసీపీ-3 ఓపెన్ కాస్టులో ఓబీ కాంట్రాక్టుల వద్ద పని చేసే కార్మికులు ఆదివారం నుంచి సమ్మెకు దిగారు. వేతనాలు పెంచాలని, బెల్లం, టీ షర్టులు ఇవ్వాలని, మెస్ బిల్లు చెల్లించాలనే డిమాండ్లతో కార్మికులు సమ్మెకు దిగారు. ఓసీపీ-3లో ఓబీ పనులు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్ కంపెనీ, ఓసీపీ-5లో నిర్వహిస్తున్న పీసీ పటేల్ కంపెనీలోని సుమారు వెయ్యి మంది కార్మికులు సమ్మె చేశారు. ఈ డిమాండ్లపై కాంట్రాక్టు కంపెనీలు రెండు మూడు రోజుల్లో స్పందిస్తామని చెప్పినప్పటికీ కార్మికులు వినలేదు. సోమవారం నుంచి ఓబీ కంపెనీల్లో పనులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఆదివారం స్థానిక కార్మికులు సమ్మె చేయగా ఇతర ప్రాంతాల కార్మికులు విధుల్లో కొనసాగుతున్నారు. సోమవారం నుంచి ఇతర ప్రాంతాల కార్మికులను అడ్డుకుని సమ్మెలో పాల్గొనేలా ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. రెండేళ్ల క్రితం కార్మికులు సమ్మె చేసి వేతనాలు పెంచుకున్నారు. రెండేళ్లుగా కార్మిక చట్టాలు ఓబీ కంపెనీల యాజమాన్యాలు అమలు చేయడం లేదని, వేతనాలు పెంచాలని కార్మికులు ఆందోళనకు దిగారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో మందుల కొరత

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సరైన మందులు లేక రోగులు విలవిలాడుతున్నారు. బయట మెడికల్ షాప్‌లో మందులు కొనలేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బీపీ, మధుమేహం వ్యాధులకు సంబంధించిన మందులు నెలరోజుల నుంచి కొరత ఉంది. ఇటీవల గోదావరిఖనికి చెందిన ఏజన్సీకి కాంట్రాక్టు ఇచ్చిన సదరు కాంట్రాక్టర్ అత్యవసర మందులు సరఫరా చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పెరిగిన రోగుల సంఖ్య...

సింగరేణి మెడికల్ కళాశాల ప్రారంభమైన తరువాత గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రోజుకు 1300 నుండి 1500 మంది ఇన్ పేషెంట్లు వస్తున్నారు. ఇందులో ఎక్కువ మంది బీపీ, మధుమేహం వ్యాధితో బాధపడేవారు. వీరు నెలనెల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి డాక్టర్ వద్ద పరీక్షలు చేయించుకొని నెలకు సరిపడే మందులు తీసుకెళుతుంటారు. బీపీ, మధుమేహంకు సంబందించిన మందులు అందుబాటులో లేకపోవడంతో బయట మందుల షాప్‌లో వీటిని కొనుగోలు చేసే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని ఫార్మసిస్టులు...

మందులు కొరత ఉందని చెప్పినప్పటికీ ఫార్మసిస్టులు పట్టించుకోవటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి మందల కొరతపై ఇండెంట్ పెట్టవలసి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రోగులకు అత్యవసర సమయంలో ప్రైవేట్ ఏజెన్సీల నుంచి తెప్పించవలసి ఉండగా పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా మందుల కొరత తీర్చాలని రోగులు కోరుతున్నారు.

వాకింగ్‌తో ఆరోగ్యం



ఇంటర్నేషనల్ వాకర్స్ ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వాకింగ్ చేయడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు వాకింగ్ చేయాలని సూచించారు. వాకింగ్ చేసిన వారు ఆరోగ్యంతోపాటు రోజువారి విధుల్లో చురుకుగా ఉంటారని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వాకర్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ నరసింహస్వామి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సయ్యద్‌అతీఫ్‌లను అభినందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ డిప్యూటీ గవర్నర్ వెంకట్‌రెడ్డి, కోఆర్డినేటర్ సందీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఐటీఐ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టె లక్ష్మణ్, సెక్రటరీ చింతపండు రాజమల్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు హైటెక్ శ్రీనివాస్, తిరుపతిగౌడ్, సెక్రటరీ అడిచర్ల రమణమూర్తి, అమలాపురం శ్రీనివాస్, తిరుమల్ వాకర్స్ బృందం పలువురు పాల్గొన్నారు.

జయ కనకదుర్గ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌లాల్ స్టేడియం సమీపంలోని జయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం లోక కల్యాణార్థం, తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మహా రుద్ర సహిత శతచండీ యాగంలో భాగంగా సూర్య భగవానునికి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, పెద్ద ఎత్తున స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ గైర్హజరు విద్యార్థులకు మరో అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ మరో అవకాశం కల్పించింది. ఈనెల 3 నుంచి 16వ తేదీ వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిచారు. హాజరు కాని విద్యార్థులు సప్లిమెంటరీలో, మరుసటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండేది. ఈసారి బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇన్‌స్టంట్ ప్రాక్టికల్స్‌కు జిల్లా కేంద్రంలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులందరికీ ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తారు. హాజరు కావాలనుకునే విద్యార్థులు డీఐఈవోను సంప్రదించి అను మతి తీసుకోవలసి ఉంటుంది.